క్లుప్తంగా

కాళోజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



ఆత్మకూర్: యువత కాళోజీ నారాయణరావు స్ఫూర్తితో ముందుకెళ్లాలని, గత ఎన్నికల్లో పార్టీలు ఇచ్చిన హామీలపై ప్రశ్నించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాఘవ, మహేందర్ అన్నారు. కాళోజీ నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఆత్మకూర్‌లోని ప్రతిభ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కేజీ టు పీజీ ఉచితవిద్య, నీళ్లు, నిధులు, నియామకాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేష్, రోహిత్, అరవింద్, నరేందర్, నందిని, గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి



వీపనగండ్ల: మండల కేంద్రంలో గంగమ్మ జాతర సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఎంపీపీ కమలేశ్వర్‌రావు రైతుబంధు సమితి అధ్యక్షుడు మల్లయ్య యాదవ్, ముంత శివ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత ధారాసింగ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ఎత్తం కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఆత్మకూర్: ఈనెల 30న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సీఐ కేఎస్ రత్నం, ఎస్ఐ నరేందర్, స్పెషల్ బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీచౌక్, చెరువు కట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలించాలంటే దానికి సంబంధించిన ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

సంప్రదాయాల బొమ్మల కొలువు



ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లిలో దీపావళిని పురస్కరించుకొని మహిళలు మూడు రోజులుగా బొమ్మల కొలువు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో బొమ్మల కొలువును నిర్వహిస్తుంటారు. ఎక్కువగా సంక్రాంతి, దసరా, దీపావళి పండుగల సమయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ఆనవాయితీ అని మహిళలు తెలిపారు. ఎద్దుల బండ్లు, ఇళ్ల బొమ్మలు తదితర వాటిని ఏర్పాటు చేస్తారని, దీంతోపాటు ఇక్కడే లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు.

నేడు గంగమ్మ జాతర మహోత్సవం



వీపనగండ్ల: దీపావళి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో మంగళవారం గంగమ్మ జాతర మహోత్సవం ఘనంగా జరగనున్నాయి. పాముకాటు ఉత్సవంగా ఏళ్లుగా గ్రామంలో తిరునాళ్లను తలపించే విధంగా గంగమ్మ ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహిస్తారని పూజారులు తెలిపారు. ఈ ఉత్సవాలకు చిన్నంబావి, పాన్‌గల్, పెంట్లవెల్లి మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్నారు.

ఇంటింటి ప్రచారం

చిన్నంబావి: కొల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆయన మండలంలోని పెద్దదగడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రరెడ్డి, కళ్యాణ్ రావు, కృష్ణప్రసాద్ యాదవ్, బీచుపల్లియాదవ్, విద్యాసాగర్‌రావు, సర్పంచ్ సురేందర్ సింగ్, ఎంపీటీసీ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

- రక్షణ గోడలు లేని కల్వర్టులు
- సూచిక బోర్డులు లేని మలుపులు



రంగాపూర్ నుంచి బునాదిపూర్ వెళ్లే దారిలో సూచికలు లేని మలుపులు



వెంకటాపురం వద్ద రక్షణ గోడ లేని కల్వర్టు

పెబ్బేరు రూరల్: రక్షణ గోడలు లేని కల్వర్టులతో ప్రయాణం ప్రమా దకరంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బునాదిపూర్ శివారులో వాగుపై నిర్మించిన కల్వర్టు, బూడ్డిపాడు నుంచి అయ్యవారిపల్లికి వెళ్లేదారిలో ఉన్న రోడ్డు డ్యాంలకు, బునాదిపూర్ నుంచి రంగాపూర్‌కు, పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే దారిలో వెంకటాపురం శివారులో కల్వర్టుకు రక్షణ గోడలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న రోడ్డు డ్యాంలకు, రక్షణ గోడలు లేని కల్వర్టులతో పాటు పలు కల్వర్టులు నాణ్యతను కోల్పోయి శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు..

కల్వర్టుల వద్ద రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయి. రహదారులపై నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంట బునాదిపూర్, పెంచికలపాడు, సూగూరు, యాపర్ల, రాంపురం వెళ్లే రహదారులపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని, శిథిలమైన కల్వర్టులను మరమ్మతు చేయించాలని, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు పెట్టాలి..

మండలం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే మార్గంలో మలుపుల వద్ద సూచిక బోర్డులు, కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపు దగ్గర సూచిక బోర్డులు, కల్వర్టుల వద్ద సైడువాల్స్ ఏర్పాటు చేయాలి.

– దేవదాస్, వెంకటాపూర్

నిత్యం ప్రమాదాలు..

కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన కల్వర్టులకు మరమ్మతు చేపట్టాలి.

– రమేష్, సూగూరు

జనగళం

ఓటుతోనే మార్పు



ఓటు అనేది వజ్రాయుధం లాంటిది. ప్రలోభాలకు లొంగకుండా మన జీవితాలను మార్చగలడు అనే వ్యక్తికి స్వేచ్ఛగా ఓటు వేయాలి. ప్రలోభాలకు తలొగ్గి ఓటు వేస్తే ఐదేళ్లు వెనక్కి వెళ్లినట్లే. అభివృద్ధిపై నిర్దిష్ట లక్ష్యాలు ఉన్నవారిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం.

– వెంకట్రాములు, హోటల్ నిర్వాహకుడు, కొత్తకోట



రాజకీయ లబ్ధి కోసమే..

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. రాజకీయ లబ్ధి కోసం పార్టీలు ఇష్టం వచ్చినట్లు వాగ్దానాలు చేస్తున్నాయి. కానీ నిరుద్యోగుల గురించి పట్టించుకునే నాయకుడే కరువయ్యాడు. యువత భవిష్యత్‌కు భరోసానిచ్చే నాయకుడికే ఓటు వేయాలి.

– సంతోష్‌రాజ్, ప్రైవేట్ లెక్చరర్, కొత్తకోట

ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలి..



ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల కాలేదు. వచ్చిన అరకొర నోటిఫికేషన్లు కూడా కోర్టు మెట్లపైనే చక్కర్లు కొడుతున్నాయి. దీనికి తోడు పేపర్ లీకేజీలతో నిరుద్యోగులు నిండా మునిగారు. నిరుద్యోగుల ఆత్మహత్యలకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యత వహించాలి. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు ఉచిత హామీలకు ప్రాధాన్యం తగ్గించి నిరుద్యోగ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేసేలా ప్రణాళికలు రచించాలి.

– రామకృష్ణ, పాన్‌గల్

ఉచిత విద్య, వైద్యం ఇవ్వాలి



ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పాలకులు ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందించాలి. అదే తరహాలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు కృషి చేయాలి. వేతన జీవులు సగటు వారి సంపాదనలో ఎక్కువ భాగం తమ పిల్లల చదువులకు, ఆరోగ్యంపైనే ఖర్చు పెట్టే దుస్థితి ఉంది. నిధులు, నియామకాల డిమాండ్‌తో ఏర్పడిన తెలంగాణలో పేదలను గుర్తించాల్సిన అవసరం ఉంది.

– నితిన్‌కుమార్, ఐటీఐ విద్యార్థి, మదనాపురం

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బోయలపల్లి గ్రామస్తులు

సాక్షి, నెట్‌వర్క్: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు పసుపుల పరశురాం, బోయలపల్లె, మొలచింతలపల్లి గ్రామస్తులతో పాటు పట్టణంలోని 7వ వార్డుకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలం కరోనాతో పోరాడామని, మిగిలిన మూడేళ్ల కాలంలో తనకు చేతనైనంత వరకు అభివృద్ధి పనులు చేశానని వివరించారు. బోయలపల్లిని గ్రామ పంచాయతీగా చేయించానని, వచ్చేసారి అక్కడ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వీపనగండ్ల మండల కేంద్రంలో జరగనున్న దీపావళి, గంగమ్మ జాతర సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయమ్మ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోడేరు మండలంలోని తీగలపల్లిలో వీరభద్రస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సింగోటం ఆలయం వరకు పాదయాత్ర..

కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని హర్షన్న యువసేన నియోజకవర్గ అధ్యక్షుడు రంగాపురం శివారెడ్డి ఆధ్వర్యంలో పాన్‌గల్ పెద్దమ్మ గుడి నుంచి సింగోటం లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. శాగాపూర్ సర్పంచ్ మాణికయాదవ్, కేతేపల్లి సింగిల్ విండో డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, తిరుపతియాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మౌలాలి మద్దతు తెలిపారు. ఎమ్మెల్యేకు మద్దతుగా రంగినేని అభిలాష్ రావు పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, శాగాపూర్‌తండాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో వీపనగండ్ల ఎంపీపీ కమలేశ్వర్‌రావు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ముంత మల్లయ్య యాదవ్, మౌలాన్‌బీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, రఘుపతినాయుడు, జ్యోతినందన్‌రెడ్డి, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీలకంగా పనిచేయాలి

వనపర్తి టౌన్: బూత్ కమిటీలు క్రియాశీలకంగా పనిచేస్తే వనపర్తి నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో పట్టణ, మండల బూత్ కమిటీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బుడ్డన్న, సీతారాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్, కొమ్ము సామెల్, పెద్దిరాజు, రాములు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రంగులు మార్చే నాయకులను నమ్మొద్దు

పాన్‌గల్: రంగులు మార్చే నాయకులను నమ్మకుండా నియోజకవర్గ అభివృద్ధికి పనిచేసే వారికి ఒక్క అవకాశం ఇవ్వాలని కొల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని వెంగళాయిపల్లి, బండపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సింగోటం రామన్న, రోజారమణి, అన్వేష్, నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో జీవిస్తున్న అనాథ ముత్యాలురెడ్డి (63) సోమవారం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు బస్టాండుకు చేరుకుని అనాథ శవానికి హిందూ ఆచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. గోపాల్‌పేట మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన ముత్యాలు రెడ్డిని తన భార్య వదిలేయడంతో రేవల్లి మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఉండి జీవనం కొనసాగించేవాడని తెలిసింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన శివరాంరెడ్డి, జానకీరాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పర్వతాలు, ఇతర నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

గ్రామకంఠంలో చేర్చేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల స్థలాన్ని గ్రామ కంఠంలో చేర్చేందుకు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు కృషి చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో మండల సీపీఐ నాయకులు లింగన్న, సహదేవుడు, కాకం కాశన్న మాట్లాడుతూ తెల్లరాళ్లపల్లి కొత్త గ్రామంలో సుమారు 150 మంది 20 ఎకరాల పట్టా భూములు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఇళ్లు నిర్మించుకొని నాలుగు దశాబ్దాల నుంచి నివాసం ఉంటూ కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు చెల్లిస్తున్నా ఆ స్థలాన్ని గ్రామ కంఠంలో చేర్చలేదని అసహనం వ్యక్తం చేశారు. పట్టాదారులకు ఆ భూమి నుంచి రైతుబంధు కూడా పొందుతున్నారన్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల నేతలు ఆ భూమిని గ్రామ కంఠంలో చేర్చిస్తామని హామీ ఇవ్వాలన్నారు.

చౌడేశ్వరి ఆలయంలో పూజలు



పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ వనపర్తి అభ్యర్థి తూడి మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి, రాష్ట్రయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డితో కలిసి సోమవారం పట్టణ కేంద్రంలోని చౌడేశ్వరి ఆలయం పూజలు, షేక్‌షావలీ ఉర్సు సందర్భంగా దర్గాలో ప్రార్థనలు జరిపించారు. అనంతరం ముస్లింలు వారికి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, సురేందర్‌గౌడ్, వెంకట్రాములు, సత్యనారాయణ, సాయితేజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



వనపర్తి

ఘనంగా దీపావళి సంబురాలు

సాక్షి, నెట్‌వర్క్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, నోములు, రథం నిర్వహించి ఇళ్ల ముంగిళ్లలో దీపాలను వెలిగించి టపాసులు కాల్చి వేడుకలను జరుపుకొన్నారు.



ఆత్మకూర్‌లో..



వెల్టూరులో..

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చూపిస్తా



మాట్లాడుతున్న మాదిరెడ్డి జలందర్‌రెడ్డి

అమరచింత: మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలందర్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తూక్యానాయక్‌తండాతో పాటు పట్టణ పురవీధుల గుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తూక్యానాయక్‌తండాలో పలువురు గిరిజన యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, శ్రీనివాసులు, మేర్వరాజు, వెంకటేశ్వర్లు, అశోక్, నరాల నారాయణ, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సభకు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలో అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండయ్య, కనకరాజు, కర్ని స్వామి, శ్రీనివాస్, అఖిలరెడ్డి, ప్రసన్నరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో సోమవారం బీజేపీ అభ్యర్థి జలేంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీనివాసులు, మజ్జిగ సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల భవిష్యత్ కోసం అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: భవిష్యత్ వందేళ్ల దూరదృష్టితో ఆలోచించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. సోమవారం వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకుడు బూజాల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా నాయకుడు జశ్వంత్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి తన నివాసంలో గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి నాంది పలికింది బీఆర్ఎస్ హయాంలోనే అన్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం ఈ ఎన్నికల్లో ఉపయోగపడుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో రాజశేఖర్, ఆంజనేయులు, తిరుపతయ్య, దినేష్‌రెడ్డి, శ్యామ్, నిరంజన్, శ్రీనివాసులు, కాంతయ్య, మాణిక్‌రెడ్డితో పాటు మరో 50 మంది ఉన్నారు. ఖిల్లాఘనపురం మండలం సోళీపురం గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రాంరెడ్డిల ఆధ్వర్యంలో 30 మంది, జిల్లా కేంద్రంలోని 26వ వార్డు కౌన్సిలర్ జంపన్న ఆధ్వర్యంలో సుమారు వంద మంది బీఆర్ఎస్‌లో చేరారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

పెబ్బేరు రూరల్: మండలకేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు జయప్రకాష్‌శెట్టితో పాటు కొందరు నాయకులు సోమవారం మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, గౌని బుచ్చారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సహదేవుడు, రవికుమార్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లికి చెందిన కుమ్మరి ఆనంద్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సోమవారం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డు ప్రమాద బాధితుడు మేడమోని నాగరాజును పరామర్శించారు.

ఇంటింటి ప్రచారం..

పెబ్బేరు ఉమ్మడి మండలంలోని వెంకటాపురం, బునాదిపురం, బూడిదపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి, కూతురు తేజశ్రీ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గోవిందునాయుడు, సత్తార్, మజీద్, మల్లేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ఉత్సవం



బొడ్రాల ఊరేగింపులో హారతులతో మహిళలు

అమరచింత: పట్టణంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే బొడ్రాయి ఉత్సవాలకు సంబంధించి ఆళ్లగడ్డ నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చిన బొడ్రాళ్లకు ఉత్సవ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మతో పాటు పట్టణ మహిళలు బొడ్రాళ్లకు మంగళహారతులు ఇచ్చారు. 14న గణపతి పూజతో కార్యక్రమం మొదలవుతుందని, 15న హోమం, ఊరేగింపుతో పాటు 16న బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తాటికొండ రమేష్, కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి, వాటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, నాగభూషణంగౌడ్ పాల్గొనగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ జగన్మోహన్ బందోబస్తు నిర్వహించారు.

ఆర్చీలో ఇరుక్కున చెరుకు ట్రాక్టర్



ఆర్చీలో మధ్యలో ఇరుక్కున్న చెరుకు లోడ్ ట్రాక్టర్

అమరచింత: పట్టణంలో బొడ్రాళ్ల ఉత్సవాలను పురస్కరించుకుని ప్రధాన రహదారికి ఇరువైపులా దేవతామూర్తుల చిత్రాలతో కూడిన ఆర్చీలను ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు వెళ్లడానికి వీలుగా ముఖ ద్వార తోరణాలు ఏర్పాటు చేసినా చెరుకు ట్రాక్టర్ మాత్రం ఆర్చీలో ఇరుక్కుపోయింది. అధిక లోడ్‌తో ట్రాక్టర్‌పై చెరుకును వేసుకొని రావడంతో ఇరుక్కుంటున్నాయని, లోడ్ తగ్గించి రావాలని పలుమార్లు బొడ్రాయి ఉత్సవ నిర్వాహకులు చెరుకు ట్రాక్టర్ల డ్రైవర్లను కోరినా ఫలితం లేదు. సోమవారం సాయంత్రం అధిక లోడ్‌తో వచ్చిన చెరుకు ట్రాక్టర్ ఆర్చీ ముఖద్వారంలో ఇరుక్కుపోవడంతో నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాక్టర్‌పై ఉన్న చెరుకును కిందకు వేసి అంటిస్తామని స్థానికులు వాగ్వివాదానికి దిగారు. ఎస్ఐ జగన్మోహన్ చొరవతో వివాదం సద్దుమనిగి చెరుకు ట్రాక్టర్‌పై ఉన్న చెరుకును తొలగించి ట్రాక్టర్ బయటకు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. 17 వరకు చెరుకు తరలించే ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులు వీటిని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.

తప్పుడు ప్రకటనలు మానుకోవాలి

మదనాపురం: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్య యాదవ్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ 9 ఏళ్ల పాలనలో ప్రజలు అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, జయంతమ్మ, చాంద్‌పాషా, నాటీసీ నాగన్నయాదవ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.